# నగ్నసత్యం

"ఓరేయ్! అరవిందం! నీ ప్రేమ గొడవల్లో నన్నెందుకు దించుతావురా? ఏదో నన్నిలా గౌరవంగా బ్రతకనీ" అన్నాను.

"నువ్వనుకున్నంత లాకాయి లూకాయిప్రేమ కాదురా. మాది "అమర ప్రేమ" అందుకేరా నిన్ను రిక్వెస్టు చేస్తున్నది. ప్రాణ స్నేహితుడికిమాత్రం సహాయం చెయ్యలేవురా?...ప్లీజ్...." అంటూ ప్రాధేయపడ్డాడు.

"ఏమోరా నాకే నమ్మకం లేదు అయినా సరే పద చూద్దాం" అంటూ రూమ్‌కి తాళంవేసి వాడితో బయలుదేరాను.

అరవిందంగాడీ మధ్య బీచ్‌లో ఎవరో అమ్మాయిని చూసి ప్రేమించాడుట. ఆమె సంగతెల్లా ఉన్నా వీడుమాత్రం ఆమె పేరును పంచాక్షరీ మంత్రంలా విడువకుండా జపం చేస్తున్నాడు. వాడి ప్రేమ కలాపాలన్నీ ఏరోజుకారోజు నాతో ఏకరువుపెడతాడు.

ఒకరోజు హోరున వర్షంకురుస్తొంటే నిలువునా తడుసుకుంటూ వచ్చాడు.

ఇదేం పోయేకాలంరా నీకు అంతలా తడుసుకుంటూ వచ్చావు ?" అన్నాను కోపంగా.

"ప్రేమరా! ప్రేమ మేము బీచ్‌లో ఉండగా బ్రహ్మాండంగా వర్షం వచ్చింది. ఒకే ఒక రిక్షా దొరికితే ఆమెను అందులో పంపించి నేనిలా వచ్చాను" అన్నాడు.

"పోనీ నువ్వుకూడా ఆ రిక్షాలో..." అన్నాను.

"ఛా! అందులో మనత్యాగం ఏం వుందిరా? స్వార్థం తప్ప" అన్నాడు.

"ఏదో ఏడువ్ నాకెందుకులే" అని వూరుకున్నాను.

ఆ మట్టున వాడికి జ్వరంవచ్చి మూడు రోజులవరకూ మంచం దిగలేదు. ఇటువంటి సంఘటన లెన్నో జరిగాయి ఈ మధ్య.

"ఆమె ఉద్దేశం కూడా తెలుసుకొని ఆమె ఇష్టపడి "పెళ్ళిచేసుకోరాదూ?" అన్నాను వాడి

బాధ పడలేక.

"ఆమెకు మొదటినుంచీ యిష్టమేరా నువ్వు కూడా ఆమెను చూసి నీ సలహా ఇస్తే తప్పక చేసుకొంటూరా" అన్నాడు.

మీరిద్దరూ ఒప్పుకుంటే నే నెందుకురా?"

" అది కాదురా నువ్వు తప్పకుండా ఆమెను చూసి నీ సలహా ఇవ్వాలిరా" అంటూ మొదలుపెట్టాడు.

ఇవాళ ఉదయంనుంచి వాడి బోరు మరీ ఎక్కువయింది. విధిలేక వాడితో బయలుదేరాను ఆమెను చూడ్డానికి

"ఏదిరా ? నీ సుందరి ఎక్కడా కనిపించదేం?" అన్నాను బీచ్‌లో చతికిలపడుతూ

"వస్తుందిరా కొంచెం ఓపికపట్టు. రోజూ ఈపాటికి వచ్చేసేదికాని ఇవాళ ఎందుచేతో లేటయింది" అన్నాడు.

"నిజంగా వస్తుందంటావా?" అన్నాను సిగరెట్ వెలిగించుతూ.

"తప్పకుండా వస్తుందిరా. నేను ఖచ్చితంగా చెప్పగల "

సముద్ర కెరటాలు ఒక్కొక్కటే నిలువెత్తున లేచి విచ్చిన్నమై దరిని చేరుకుంటున్నాయి. వాటిని చూస్తూంటే మనసులో మధురభావాలెన్నో మొలకలెత్తుతున్నాయి. ఆలోచిస్తూ పరాగ్గా కూర్చున్నా.

"వచ్చేసింది రా!" అంటూ అరవిందం నా నోట్లో సిగరెట్ తీసి దూరంగా గిరాటేసి నిటా‌గా కూర్చున్నాడు.

షిఫాను సిల్కు చీర, లేడీ షూ, చేతికి చిన్న బంగారు గొలుసు వాచీ చంద్రబింబంలాంటి గుండ్రని ముఖం పద్దెనిమిదేండ్ల సౌందర్యరాసి మావేపు చకచకా నడుచుకొని వస్తోంది. ఆమె ప్రక్కనే ఓ ఎనిమిదేళ్ళ కుర్రాడు ఆమె చెయ్యిపట్టుకొని నడుస్తున్నాడు.

"ఆ కుర్రాడు?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆమె తమ్ముడురా నేనిదివ ‌కే కూపీలాగాను" అన్నాడు అరవిందం.

ఆమె వచ్చి మాకు నాలుగు గజాల దూరంలో కూర్చుంది మా వాడిని చూసి ఓ చిరునవ్వు బాణం విసిరింది. పైట సర్దుకుంటూ

మావాడి సంగతెల్లావున్నా ఆమెను చూడగానే ముందు నాకు మతిపోయినట్టయింది. నాకేకాదు ఆమెను చూచిన వాళ్ళకెవరికైనా అంతే.

సర్వసంగ పరిత్యాగులైన ఆమె అందానికి "దాసోహం" అనకమానరు.

"అదృష్టవంతుడివిరా! అరవిందం బంగారు పిచ్చుకను పట్టావు" అన్నాను.

వాడు సమాధానంగా చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

"అరవిందం! నువ్వు ఉపేక్షిస్తే లాభం లేదురా. ఎవరైనా తన్నుకుపోగలరు జాగ్రత్త!" అన్నాను నవ్వుతూ.

"ఆ భయం లేదురా బ్రదర్. మమ్మల్నెవరూ వేరు చెయ్యలేరు హరి రుద్రాదులైనా సరే తెలుసా?" అన్నాడు ధీమాగా. "ఏడిశావులే. పద చీకటి పడింది" అంటూ లేచాను.

ఆమెకూడా లేచి దూరంగా ఇసుకలో పిచ్చుకగూళ్ళు కట్టుకుంటూన్న కుర్రాడి చేయిపట్టుకొని బయలుదేరింది.

"రా రా ఆమె ఇల్లు చూపెడతాను" అన్నాడు అరవిందం.

నేను కాదనలేక వాడి వెనుక బయలుదేరాను.

"అదేరా వాళ్ళిల్లు " అంటూ చూపించాడు.

ఆమె గుమ్మంలో నిల్చుని మరొకమారు మావేపుచూసి చిరునవ్వుతో మెరుపుతీగెలా యింట్లో మాయమయింది.

"ఇంతకూ నీ ఉద్దేశం ఏమిటిరా?" అన్నాడు.

"శుభస్య శీఘ్రం అన్నారు, కానీ త్వరగా" అన్నాను.

"అదేరా బ్రదర్ నేనూ అనుకుంటున్నాను. రేపు నువ్వు వాళ్ళ పేరెంట్స్‌తో మాట్లాడి ఆ పుణ్యకార్యం నీ చేతులమీదుగా..."

"హతోస్మి?" అన్నాను అదిరిపడి.

"అరవిందం! క్షమించురా ఆ పనిమట్టుకు నావల్లకాదు సీ్మ"

"నువ్వలా అంటే ఎల్లారా? నాకు నీకన్న దగ్గరవాళ్ళెవరున్నారు? నువ్వుకాని ఒప్పుకోకపోతే నేను నిలువునా ఆత్మహత్య చేసుకుంటాను" అన్నాడు విచారంగా.

వాడి సంగతి నాకు బాగా తెల్సు. అన్నంతపనీ చేస్తాడు. అందుకు వాణ్ణి తృప్తిపర్చడాన్కి నేను అంగీకరించినా నాకు లోపల చాలా భయంగానే వుంది. నేనిదివరకు ఇటువంటి పనులెప్పుడూ చేయలేదు. పెళ్ళి మాటలంటే మామూలు విషయం కాదు. అనుభవంవుండాలి. ఢక్కా ముక్కా తిన్నవాళ్ళు తప్ప నాలాంటివాడివల్లేం జరుగుతుంది? కాని నూరబద్ధాలాడైనా ఒక పెళ్ళి చెయ్యమన్నారు. అందుకే నేను అంగీకరించాను.

ఎల్లా మాట్లాడాలో రాత్రంతా రిహార్సిల్స్ వేసుకొని ఉదయాన్నే బయలుదేరి వాళ్ళింటికెళ్ళాను.

హాల్లో యీజీ ఛెయిర్‌లో కూర్చొని పేపరు చదువుకొంటున్నా రొకాయన. బహుశా ఆమె తండ్రి కాబోలనుకున్నా, నా ఊహ నిజమయింది.

"నమస్తే సార్" అన్నాను గొంతుక సవరించుకొని.

ఆయన ప్రతి నమస్కారం చేసి

"రండి. కూర్చోండి" అంటూ కుర్చీ చూపించారు.

నేను కూర్చున్నాను ఒద్దంటున్నా వినకుండా కాఫీ తెప్పించి యిచ్చారు. నేను కాఫీ తాగడం పూర్తిచేసి వచ్చిన విషయం మెల్లమెల్లగాఆయన చెవిన వేసాను. మా అరవిందం పేరు వినగానే ఆయన నరసింహావతారం దాల్చారు.

"ఇదుగో మిస్టర్! ఇదేం సంసారుల కొంపనుకున్నారా? లేక..."

"అదికాదండీ..." అన్నాను భయంగా.

"ఏదికాదు? వయసులో వున్న ఆడపిల్లలకు ప్రేమ లేఖలు రాయడం వెంటపడి వెకిలివేషాలు వెయ్యడం-మీ వాడు నాకంటపడలేదు, లేకుంటే ఈపాటికి..." అంటూ రెచ్చిపోయారు.

"క్షమించాలి. మీరు చాల పొరపాటుపడ్డారు. మీరనుకున్నంత దుర్మార్గుడు కాడు మావాడు చాలా అమాయకుడు. దురుద్దేశంతో వాడేపనీ చెయ్యలేదు. గౌరవమైన కుటుంబం వాళ్ళది. బాగా డబ్బున్న వాళ్ళు. బి.ఎ చదువుతున్నాడు. వాడిప్పుడు 'ఊ' అంటే చాలు లక్షమంది వస్తారు పిల్లనిస్తామని. కాని మీ అమ్మాయి, వాడు ఒకర్నొకరు ప్రేమించుకున్నారు. వాళ్ళు యే అఘాయిత్యాలకూ పోకుండా సాంప్రదాయకంగా పెళ్ళిచెయ్యడం మనవిధి" అన్నాను.

ఆయన నా ఉపన్యాసానికి విరగబడి నవ్వారు.

"పెళ్ళంటే బొమ్మలాటలనుకున్నావా...?"

"కాదు ఆజన్మాంతరం వీడని బంధం" అన్నాను.

"మిస్టర్! నువ్వింకా చిన్న వాడివి. నీకు లోకం సంగతి తెలియదు. మీవాడు తొందరపడి మా అమ్మాయి విషయంలో ఏ నిర్ణయానికైనా వస్తే అది తొందరగా మార్చుకోవడం మంచిది' ' అన్నారు.

"మా వాడు తొందరపడలేదండీ. బాగా ఆలోచించే చెప్పాడు"

"అంటే మీవాడు మా అమ్మాయిని పెళ్ళిచేసుకోడాన్కి వప్పుకున్నాడంటావు అంతేనా?'' అన్నారు గంభీరంగా.

"అవునండీ, మీ అమ్మాయికూడా" ఆయన మరొకమారు విరగబడి నవ్వారు.

"అబ్బాయి-మా అమ్మాయికి కళ్యాణయోగం లేదు. భగవంతుడామెను అందాలరాసిగా సృష్టించి ఆమెకు 'మాట" ఇవ్వలేదు" అన్నారు విచారంగా.

"అంటే మీ అమ్మాయి....?!!"

"మూగది. ఏ జన్మలో చేసిన పాపఫలమో ఈ జన్మలో అనుభవిస్తున్నది. ఎన్నో మందులిప్పించాము. ఎన్నో పూజలు పునస్కారాలు చేసి పుణ్యతీర్థాలు తిరిగివచ్చాం. కాని లాభంలేకపోయింది మీవాడు నిజంగా యిష్టపడితే నాకేం అభ్యంతరం లేదు. మరొక మారు ఆలోచించుకొని చెప్పమను" అంటూ "నగ్నసత్యాన్ని" వెల్లడించారు.

అశ్రుపూరిత నయనాల్తో ఆమె ఎదురుగా గుమ్మంలో నిల్చుంది.

నాకు తల తిరిగిపోయింది. కాళ్ళు చేతులు కలువకాడల్ని మరపించాయి.

నైరాశ్యంతో ఇంటి ముఖం పట్టేను. అరవిందం ఎదురుగా వస్తున్నాడు. అరవిందానికి ఈ మూగ వార్త ఎలా చెప్పడమో అర్థంకాలేదునాకు.

వింటే భరించగలడా? చెప్పలేక చెప్పప్రయత్నిస్తుండగా-

"ఆమె మూగదని నాకు మొదటే తెల్సురా!" అన్న అరవిందం సుభాషితానికి నాకు మళ్లీ తల తిరిగింది.

**(ప్రజామత వారపత్రిక 11-8-1963)** ✪